ప్రచార పర్వం సమాప్తం

రేపే పోలింగ్.. ఏర్పాట్లు పూర్తి చేసిన జీహెచ్ఎంసీ

చివరి రోజు బైక్ ర్యాలీలతో హోరెత్తించిన బీఆర్ఎస్ అభ్యర్థులు

ఆఖరి ఘడియలను సద్వినియోగం చేసుకునే పనిలో అభ్యర్థులు

ఓటరు దేవుని ప్రసన్నం కోసం ముమ్మరంగా చివరి ప్రయత్నాలు

సోషల్ మీడియాపై నేతల చూపులు

సిటీబ్యూరో, మే 11(నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల ప్రచారం ముగిసింది. గల్లీలు, కాలనీల్లో హోరెత్తించిన వాహనాలు నిలిచిపోయాయి. ఎక్కడి మైక్‌లు అక్కటే మూగబోయాయి. ర్యాలీలు, సభలు, సమావేశాలు, పాదయాత్రలకు బ్రేకులు పడ్డాయి. గడిచిన రెండు నెలలకు పైగా నోరార తిట్టుకున్న నోళ్లు మూతపడ్డాయి. మరో 36 గంటల్లో పోల్ పోరు సమయం ఉండటంతో అభ్యర్థులు ఈ ఆఖరి ఘడియల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనులపై దృష్టి సారించారు. రకరకాల మార్గాల్లో, విభిన్న రూపాల్లో తరలించి రహస్యంగా దాచిపెట్టిన డబ్బు, మద్యం, ఇతర వస్తువులు ఓటర్ల ఇళ్లకు చేర్చేందుకు సకల ఏర్పాట్లపై సమాలోచనలు జరుపుతున్నట్లు ఆయా పార్టీల శ్రేణులు గుసగుసలాడుతున్నాయి. వాస్తవంగా నామినేషన్లు వేసిన నాటి నుంచి పెట్టిన ఖర్చంతా ఒక ఎత్తయితే ఆదివారం, సోమవారం ఉదయం వరకు అభ్యర్థులు పెట్టబోయే ఖర్చు మరో ఎత్తు అన్న చర్చ ఉంది. ఈ నేపథ్యంలోనే బూత్ స్థాయిలో జరిగే రాజకీయ సమీకరణలు, గల్లీ నాయకులతో చేసుకునే బేరసారాలపై అభ్యర్థులు తలమునకలయ్యారు. కాగా, ప్రచారం చివరి రోజు శనివారం పార్లమెంట్ నియోజవకర్గాలలో గులాబీ మయం చేస్తూ గులాబీ అభ్యర్థులు బైక్ ర్యాలీలతో హోరెత్తించారు.

ఒక్కడే.. అన్నీ తానై...

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, కేటీ రామారావు ఒక్కడే అన్నీ తానై అభ్యర్థుల తరపున రోడ్ షోలు, కార్నర్ సమావేశాలు, సమన్వయ సమావేశాలు, ముస్లిం, మైనార్టీలతో మీటింగులలో పాల్గొన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా పద్మారావు గౌడ్, హైదరాబాద్‌లో గడ్డం శ్రీనివాస్ యాదవ్, మల్కాజ్‌గిరిలో రాగిడి లక్ష్మారెడ్డి, చేవెళ్లలో కాసాని జ్ఞానేశ్వర్‌లకు మద్దతుగా కేటీఆర్ నిర్వహించిన రోడ్ షోలకు జనం వెల్లువలా తరలివచ్చారు. హైదరాబాద్ అభివృద్ధికి బ్రాండ్‌గా నిలిచిన రామన్నకు మరోసారి అండగా ఉంటామని గ్రేటర్ ప్రజలు భరోసా కల్పించారు. మొత్తంగా కాంగ్రెస్ తెచ్చిన నాలుగున్నర నెలల మార్పు మాకు వద్దంటూ రోడ్ షో వేదికగా జనాలు ప్రతిస్పందించారు. రోడ్ షోలకు వచ్చిన జన స్పందన చూసి గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపు అయ్యింది. దీంతో పోలింగ్ ముగిసే వరకు మరింత కష్టపడి పనిచేయాలనే పట్టుదల వారిలో కనబడుతుంది. కాలనీ, బస్తీ, బస్తీల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీల వంచనను వివరించాలన్న ఉత్సాహం వారిలో నెలకొన్నది. రోడ్ షోలు సూపర్‌హిట్ అవుతున్నాయని, తమకు, తమ యువనేత కొత్త జవసత్వాలు అందించారని, ఈ స్ఫూర్తితో ఎన్నికలు అయిపోయేంత వరకు అవిశ్రాంతంగా పనిచేస్తామని కార్యకర్తలు, నాయకులు రెట్టించిన ఉత్సాహంతో ప్రకటిస్తుండటం విశేషం.

సోషల్ మీడియాపై నేతల చూపులు

ప్రచారం ముగిసిన వెంటనే అభ్యర్థులు, వారి అనచరులు, బంధువులు కంప్యూటర్ల ముందు వాలిపోయేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సోషల్ నెట్ వర్కింగ్ ద్వారా కొందరు అభ్యర్థులు ప్రచారం చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. రోడ్ షోలు, బహిరంగ ప్రచారంతో మాస్ ఓటు బ్యాంకును ఆకట్టుకున్న అభ్యర్థులు ఇప్పుడీ పరిమిత సమయాన్ని క్లాస్ ఓటర్లపై దృష్టి పెట్టారు. తమ పార్టీకే, నాకే ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా అభ్యర్థులు తాము పోటీ చేసే ప్రాంతంతో పాటు తమ పార్టీ గురించి కూడా సోషల్ నెట్‌వర్క్ సైట్లలో పొందుపరుస్తున్నారు. తమ బయోడేటా, పార్టీ కార్యక్రమాల్లో తాము పాల్గొంటున్న ఫొటోలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేసుకుంటూ లైక్స్, షేరింగ్, కామెంట్స్ కోసం ఎదురు చూస్తున్నారు. ఐతే అధికారులు మాత్రం సోషల్ మీడియా ప్రచారంపై గట్టి ఫోకస్ పెట్టామని, ప్రకటనలపై ఎంసీఎంసీలో అనుమతి లేకుండా ప్రచారం నిర్వహించే అభ్యర్థులపై దృష్టి పెట్టినట్లు చెబుతున్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

పార్లమెంట్ ఎన్నికలకు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిపించేందుకు జీహెచ్ఎంసీ అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసింది. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలకు సంబంధించి బరిలో నిలిచిన అభ్యర్థుల వివరాలను ఈవీఎంలోకి చేర్చారు. సోమవారం జరిగే పోలింగ్ ప్రక్రియకు సంబంధించి అన్ని ఏర్పాట్లను చేశారు. ఈ రెండు పార్లమెంట్ స్థానాలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి గానూ 3986 పోలింగ్ స్టేషన్లలో పటిష్ట చర్యలు తీసుకున్నారు. 12,231 బ్యాలెట్ యూనిట్లు, 4,978 కంట్రోల్ యూనిట్లు, 5,575 వీవీ ప్యాట్లను అందుబాటులో ఉంచారు. పోలింగ్‌లో పాల్గొనే అబ్జర్వర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ ఎన్నికలను సజావుగా సాగించే ప్రక్రియలో 20 వేల మంది ఎన్నికల సిబ్బంది, 1,200 మంది మైక్రో అబ్జర్వర్లుతో పాటు దాదాపు ఆరువేల మంది పోలీస్ సిబ్బంది పాల్గొంటున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ప్రధానంగా ఎండ తీవ్రత దృష్ట్యా షామియానాలు, తాగునీరు, ఫ్యాన్లు ఇతర సౌకర్యాలు కల్పించారు. క్యూ లైన్ల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ప్రత్యేక యాప్‌ను తీసుకువచ్చారు.

ఓట్ల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
సికింద్రాబాద్ పార్లమెంట్	1810	1086875	1033396	130	2120401
హైదరాబాద్ పార్లమెంట్	1944	1125283	1091615	196	2217094
కంటోన్మెంట్ అసెంబ్లీ	232	126699	126997	10	253706
మొత్తం	3986	2338857	2252008	336	4591201

కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంలో పలుచోట్ల బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత, ఇన్‌చార్జి రావుల శ్రీధర్ రెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి శనివారం భారీ ఎత్తున బైక్ ర్యాలీ ప్రచారం చేసి, అనంతరం పార్టీ ఎన్నికల గుర్తైన కారుపై ప్రచారం చేశారు

బీజేపీ విధానాలతో దేశ ప్రతిష్టకు దెబ్బ

ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి అధ్యక్షులు విశ్రాంత జస్టిస్ చంద్రకుమార్

సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్ర కుమార్

ఖైరతాబాద్, మే 11: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ విధానాలతో ప్రపంచంలో భారత దేశ ప్రతిష్ట దెబ్బతిన్నదని ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి అధ్యక్షులు విశ్రాంత జస్టిస్ చంద్ర కుమార్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రధాని మోదీ మత విద్వేష మాటలను ప్రపంచం మొత్తం ఖండిస్తున్నదని, ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఆయన స్థాయిని తగ్గించాయన్నారు. పదేండ్ల బీజేపీ పాలనలో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలని చెప్పి రెండు లక్షలు కూడా ఇవ్వలేదన్నారు. అచ్చేదిన్ అనే వాగ్దానం అబద్ధంగా మిగిలిపోయిందన్నారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలంటే బీజేపీని ఓడించాలన్నారు.

మతం పేరుతో ఓట్లడిగే వారికి గుణపాఠం తప్పదు

హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్

జాంబాగ్‌లో ప్రచారం చేస్తున్న హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్, మే 11: బీజేపీ, మజ్లిస్ పార్టీలు మతం పేరుతో ఓట్లడిగి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నాయని, ఆ పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గం జాంబాగ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఆయన ప్రచారాన్ని చేపట్టారు. అనంతరం, గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, హైదరాబాద్ నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. పదేండ్లు బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను చేపట్టడం జరిగిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి అన్ని వర్గాల అభ్యున్నతికి పాటు పడినట్లు వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారు బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలుస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా తాను విజయం సాధించి ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎస్.ధన్‌రాజ్, పి.నరేందర్ యాదవ్, జై శంకర్ పాల్గొన్నారు.

మాలలు ఓటుతో బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలి

ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ ఓయూ అధ్యక్షుడు నామ సైదులు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 11: లోక్‌సభకు జరుగుతున్న ఎన్నికల్లో బీజేపీకి మాలలు తమ ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) ఓయూ అధ్యక్షుడు నామ సైదులు పిలుపునిచ్చారు. కిషన్‌రెడ్డిని మాలల వ్యతిరేకిగా అభివర్ణించారు. ఆయన తన రాజకీయ లాభం కోసం తమలో చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్ని మార్చే బీజేపీకి ఓటువేయకూడదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కాపాడుకోవాలంటే ఎట్టి పరిస్థితుల్లో బీజేపీకి ఓటు వేయొద్దని కోరారు. దేశంలో బీజేపీ ప్రభుత్వ హయాంలో దళితులు, క్రిస్టియన్లు, మైనార్టీలు, ఆదివాసీలపై అనేక దాడులు జరిగాయని గుర్తు చేశారు. దేశంలో ప్రజలందరికీ రక్షణ లేకుండా పోయిందన్నారు. అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కు అనే ఆయుధంతో బీజేపీని అంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. మోడీ పరిపాలనలో దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటీకరించి, అదానీ, అంబానీలకు కట్టబెట్టాలని చూస్తున్నారని దుయ్యబట్టారు.

ఇంకు చూపెట్టు.. ఆఫర్ పట్టు

నగరంలో ఓటింగ్‌పై అవగాహన పెంచేలా కార్యాచరణ

స్వచ్ఛంద ఆఫర్లను ప్రకటించిన హోటళ్లు, రెస్టారెంట్లు, హాస్పిటళ్లు

ఓటు వేసిన వారికి పారితోషికాలతో ఆకట్టుకుంటున్న వైనం

సిటీబ్యూరో, మే 11(నమస్తే తెలంగాణ): సందర్భం ఏదైనా వైవిధ్యమైన ఆలోచనలతో వినియోగదారులకు చేరువ కావడమే వ్యాపార విజయ రహస్యం. ఇదే విధానాన్ని ఇప్పుడు హైదరాబాద్‌లో వినియోగిస్తున్నారు. ఓట్ల పండుగ సందర్భంలో ఓటర్లను ఆకట్టుకుంటూ వ్యాపారం పెంచుకునేందుకు పలువురు వ్యాపారస్తులు ఆ దిశగా దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఓటింగ్‌పై అవగాహన పెంచుతూ, ప్రత్యేక ఆఫర్లతో జనాలను ఆకట్టుకుంటున్నారు. మే 13న జరిగే పోలింగ్ రోజున ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్న ఓటర్లకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటిస్తున్నారు. ఇప్పటికే ఓటింగ్ రోజున పోలింగ్ స్టేషన్లకు వెళ్లేందుకు ర్యాపిడో వంటి బైక్ రెంటల్ సంస్థలు ప్రత్యేక ఆఫర్ ప్రకటించగా, అదే తరహాలో హోటళ్లు, రెస్టారెంట్లు, విమానయాన సంస్థలు, చివరకు హాస్పిటళ్లు కూడా ప్రత్యేక ప్రోత్సాహకాలతో వినియోగదారులకు చేరువయ్యే ప్రయత్నాలు చేస్తున్నాయి.

ఓటింగ్ శాతం పెరిగేందుకు దోహదం..

ఎన్నికల వచ్చాయంటే నగరంలో జరిగే పోలింగ్‌పై అందరీ దృష్టి ఉంటుంది. రాష్ట్ర రాజధానిలో ఓటింగ్ శాతం ఏ విధంగా ఉందని చర్చించుకుంటారు. ఎన్నికలు ఏవైనా నగర ఓటర్ల నాడిని పసిగట్టేందుకు పోలైన ఓట్ల శాతాన్ని ప్రామాణికంగా తీసుకుంటారు. కానీ, నగరంలో ఎప్పుడూ అత్యల్ప ఓటింగ్ శాతం నమోదు కావడం అత్యంత దురదృష్టకరం. అధికారులు ఓ వైపు ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రచారం నిర్వహిస్తున్నా.., సిటీ జనాలు గడప దాటి బయటకు రాకపోవడంతో ప్రతిసారి అతి తక్కువగా ఓటు హక్కు వినియోగంలోకి వస్తుండగా... రాష్ట్రంలో అత్యల్ప ఓటింగ్ శాతం నమోదవుతుంది. అదే సమయంలో ఓటింగ్ రోజున వ్యాపారాలు అంతంత మాత్రంగానే ఉండటం కూడా వ్యాపారులకు కలిసి రావడం లేదు. దీంతో పోలింగ్ రోజున బిజినెస్ పెంచుకునే క్రమంలో సామాజిక బాధ్యతలో పోలింగ్ ప్రక్రియకు అనుకూలంగా వ్యాపార ప్రకటనలు చేస్తున్నారు. అందులో భాగంగా వినియోగదారులను పెంచుకునేలా ఓటేస్తే డిస్కౌంట్లు, రాయితీలు, అదనపు ప్రోత్సాహకాలతో ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటిస్తున్నాయి.

ఎన్నికల రోజున ఆఫర్ పట్టు...

ఎన్నికల రోజున పోలింగ్ స్టేషన్లకు వెళ్లే ఓటర్ల కోసం ర్యాపిడో సంస్థ ఉచిత ప్రయాణాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా పోలింగ్ స్టేషన్‌కు వెళ్లేందుకు ఆటో, బైకు, ట్యాక్సీ ఏదైనా Vote now కోడ్‌ను ఉపయోగించి ఉచితంగా ఓటు వేయొచ్చు. దీని కోసం తెలంగాణలో సర్వీసులో ఉన్న హైదరాబాద్‌తో పాటు, ఖమ్మం, కరీంనగర్, వరంగల్ వంటి టైర్-2 నగరాల్లోనూ అందుబాటులోకి తీసుకురానున్నారు. పోలింగ్ సందర్భంగా దేశ వ్యాప్తంగా 10 లక్షల మంది ర్యాపిడో కెప్టెన్లను సిద్ధం చేసుకుంది. అదే తరహాలో... హాస్పిటల్స్ కూడా స్వచ్ఛందంగా ఆఫర్లను ప్రకటించాయి. ఓటు హక్కును వినియోగించుకుని హాస్పిటల్‌కు వచ్చేవారికి ఉచిత కన్సల్టేషన్‌తో పాటు, ల్యాబ్ టెస్టుల్లో 50శాతం రాయితీని ప్రకటించింది. అదే విధంగా ఎంటర్‌టైన్‌మెంట్ అందించే 'వండర్ లా' వంటి అమ్యూజ్‌మెంట్ పార్కులు డిస్కౌంట్లతో బిజినెస్ పెంచుకునేందుకు సిద్ధమయ్యాయి. దీని కోసం లోక్ సభ ఎన్నికల్లో ఓటేసి, ఫ్యామిలీతో వండర్‌లా పార్కులో ఎంజాయ్ చేయడానికి 20 శాతం డిస్కౌంట్ ప్రకటించింది. పార్కు టికెట్లు, ఫుడ్ కాంబోలపై ఈ ఆఫర్లు వర్తిస్తాయని మే 13-15 వరకు ఈ ఆఫర్‌ను ప్రకటించింది. ఇక ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ పోలింగ్ రోజున డైన్-అవుట్లపై 50 శాతం ప్రకటించింది. ఓటు వేసి, వేలిపై ఉన్న ఇంకును చూపెడితే... నగరంలోని ప్రధాన హోటళ్లు, రెస్టారెంట్లలో ఏకంగా 50 శాతం డిస్కౌంట్‌ను స్విగ్గీ ఆఫర్ చేస్తోంది.

కారు ఢీకొని బాలుడి మృతి

చిన్నారి శివ (ఫైల్)

పీర్జాదిగూడ, మే11: ఓ వ్యక్తి అజాగ్రత్త డ్రైవింగ్ బాలుడి మృతికి కారణమైంది. ఈ ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం, హన్మకొండ లక్ష్మీ తండాకు చెందిన మాలోతు జై నాయక్, తన భార్య దివ్య, కుమారుడు శివ(2)తో కలిసి నగరానికి వచ్చి మేడిపల్లి పంచవటి కాలనీలోని ప్రియా టవర్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి సెల్లార్‌లోని రూమ్ బయట చిన్నారి శివకు అన్నం తినిపించి లోపలికి వెళ్లింది. అంతలోనే అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న విష్ణుతేజ అనే వ్యక్తి తన కారును నిర్లక్ష్యంతో అజాగ్రత్తగా నడుపుతూ సెల్లార్‌లోకి వస్తూ బయట ఉన్న శివను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై శివ అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ఘటన పరసర ప్రాంతాల వారిని కలిచివేసింది. తన కుమారుడి మృతికి కారణమైన వ్యక్తి పై బాధిత కుటుంబ సభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రేటర్‌కు మూడు రోజుల వర్ష సూచన

సిటీబ్యూరో, మే 11(నమస్తే తెలంగాణ): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాగల మూడు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశమున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఆవర్తనం ప్రభావంతో నగరంలో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 36.8 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 25.2 డిగ్రీలు, గాలిలో తేమ 36 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

కారులో తరలిస్తున్న నగదు పట్టివేత

బంజారాహిల్స్, మే 11: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నగదు పంపిణీ తరలింపుపై పోలీసుల తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడింది. శనివారం రాత్రి ఫిలింనగర్ పరిధిలో ఓ కారులో తరలిస్తున్న నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో పోలీసులు ఫిలింనగర్ చౌరస్తాలో శనివారం తనిఖీలలో ఓ ఫార్చునర్ కారును ఆపి తనిఖీ చేయగా రూ.41.98 లక్షల నగదు గుర్తించారు. డబ్బును స్వాధీనం చేసుకున్న పోలీసులు డ్రైవర్ వెంకటేష్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, సీ-5 ఇంజినీరింగ్ కంపెనీకి చెందినవిగా తేలింది. ఎమ్మెల్యే కాలనీలోని పద్మజా టవర్స్‌లో నివాసం ఉంటున్న వ్యాపారికి చెందిన నగదు అని తెలుస్తోంది. ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ర్యాలీలో పాల్గొన్న మహిళలు - బైక్ ర్యాలీ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

ఎంఎల్ఆర్ఐటీలో ముగిసిన రోబోటిక్ ఈవెంట్

ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఎల్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి తదితరులు

దుండిగల్, మే 11: రోబోటిక్స్ రంగంలో అత్యాధునిక పురోగతులు, ఆవిష్కరణలను ప్రదర్శించే జాతీయ స్థాయి రోబోటిక్ ఈవెంట్ క్లబ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం హైదరాబాద్‌లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో శనివారం ముగిసింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, విపత్తు ప్రతిస్పందన, పర్యావరణం వంటి రంగాల్లో సవాళ్లను పరిష్కరించడానికి రోబోటిక్స్ సాంకేతికతను ఉపయోగించుకోవడం, వాస్తవ ఆకర్షణలు రోబో సాకార్, రోబో సుమో, లైన్-ఫాలోయింగ్, రోబోట్లను అనుసరించి చేపట్టిన థ్రిల్లింగ్ రోబోరేస్, డ్రోన్ రేస్ వంటి ప్రదర్శనలు నిర్వహించారు. ఎంఎల్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు తయారు చేసిన చిట్టి అనే దాని స్వదేశీ ఏ1 ఆధారిత రోబోట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఎంఎల్ఆర్ఐటీ వ్యవస్థాపక కార్యదర్శి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచేందుకు, సాంకేతికతలో సరికొత్త ట్రెండ్స్‌పై అనుభవాన్ని అందించేందుకు వీలుగా వినూత్న కార్యక్రమాల్లో పాల్గొనేలా తమ కళాశాల విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. అనంతరం బహుమతుల ప్రదానోత్సవంతో కార్యక్రమం ముగిసింది. రోబోటిక్ ఈవెంట్ల విజేతలు, రన్నరప్‌లకు రూ.80 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, కళాశాల డైరెక్టర్ మర్రి శ్రేయారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే.శ్రీనివాసరావు, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎస్‌వీఎస్ ప్రసాద్, డీన్ డాక్టర్ రాధికాదేవి (ఈవెంట్ కో-ఆర్డినేటర్), ఫ్యాకల్టీ మెంటార్ రాజు నాయక్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి బీఆర్ఎస్ పాలనే నిదర్శనం

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు
- కుత్బుల్లాపూర్‌లో జోరుగా బీఆర్ఎస్ నేతలు, శ్రేణుల ప్రచారం

దుండిగల్, మే 11: పదేండ్ల బీఆర్ఎస్ పాలన సంక్షేమం, అభివృద్ధికి నిదర్శనంగా నిలుస్తుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం శాసన సభ్యులు కేపీ వివేకానంద, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పేర్కొన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కేసీఆర్ హరితవనం కాలనీ, ప్రగతి నగర్ అమరవీరుల స్తూపం తదితర ప్రాంతాలలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానందలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పదేండ్ల బీఆర్ఎస్ పాలన సంక్షేమం,అభివృద్ధికి నిదర్శనమైతే.. పదేళ్లే బీజేపీ, నాలుగు నెలల కాంగ్రెస్ ప్రభుత్వాల పాలన అబద్ధపు హామీలు, మోసపూరిత వాగ్దానాలకు ప్రత్యామ్నాయంగా మారాయన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓటు వేస్తే తెలంగాణ ప్రజల భవిష్యత్తు ప్రశ్నార్థకరంగా మారుతుందని హెచ్చరించారు. కనీసం తెలంగాణ ప్రజల వాణిని పార్లమెంట్‌లో వినిపించే నాయకుడే ఉండాలన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నాలుగవ నంబర్‌పై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన రాజ్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్లు మేకల వెంకటేష్, బాలాజీ నాయక్, గాజుల సుజాత, రాఘవేంద్రరావు, సీనియర్ నాయకులు చంద్రగిరి సతీష్, సునీత, రాజేందర్‌రెడ్డి, ఆయా డివిజన్‌ల అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు అర్పిత ప్రకాష్, నాయకులు, మహిళా నాయకురాలు పాల్గొన్నారు.

మల్కాజిగిరి ప్రజలకు మోసం చేసిన రేవంత్

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

నాడు కొండగల్‌లో ఓడిన రేవంత్ రెడ్డిని మల్కాజిగిరి ప్రజలు అక్కున చేర్చుకుని ఎంపీగా గెలిపిస్తే ఏ ఒక్కరోజు పార్లమెంట్‌కు వెళ్లి మల్కాజిగిరి ప్రజల సమస్యలను పరిష్కరించే ప్రయత్నమే చేయలేదని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మలాజిగిరి పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం సుభాష్ నగర్ డివిజన్ పరిధి, సూరారం కాలనీలోని ఓం జెండా వద్ద భారీ బైక్ ర్యాలీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్కాజిగిరి